www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల : 5.00
Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి :1 | సంచిక : 341 | సోమవారం | 20 మే 2024



కొనసాగిన సన్‌రైజర్స్ జైత్రయాత్ర

6 లో..

# కేబినెట్ భేటీకి సీఈసీ గ్రీన్‌సిగ్నల్

అత్యవసరమైన విషయాలు, తక్షణం అమలు చేయాల్సిన అంశాల ఎజెండాపైనే చర్చించాలి

## హైదరాబాద్ ఉమ్మడి రాజధాని, రైతు రుణమాఫీ అంశాలను వాయిదా వేయాలని షరతు

## ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన అధికారులెవరూ సమావేశానికి హాజరు కావొద్దు

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ :** తెలంగాణ కేబినెట్ సమావేశ నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేబినెట్ సమావేశం నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం షరతులు విధించింది. అత్యవసరమైన విషయాలు, తక్షణం అమలు చేయాల్సినటువంటి అంశాల ఎజెండాపైనే కేబినెట్ చర్చించాలని సీఈసీ షరతులు విధించింది. జూన్ 4వ తేదీ లోపు చేపట్టాల్సినటువంటి అత్యవసర అంశాలు ఆ తేదీ వరకు వేచి ఉండటానికి అవకాశం లేని అంశాలను మాత్రమే చేపట్టాలని కండిషన్ పెట్టింది. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని, రైతు రుణమాఫీ అంశాలను వాయిదా వేయాలని కేంద్ర ఎన్ని కల సంఘం షరతులు విధించింది. ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ-ులైన అధికారి ఎవరూ కేబినెట్ సమావేశానికి హాజరు కావద్దని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ నెల 18వ తేదీన శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్ర కేబినెట్ సమావేశం నిర్ణయించారు. కానీ సీఈసీ అనుమతి లభించకపోవడంతో మంత్రివర్గ సమావేశాన్ని వాయిదా వేసిన సంగతి తెలిసిందే. తాజాగా షరతులు విధించి కేబినెట్ సమావేశానికి కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది.

మిగతా 2 లో




# 17 జిల్లాలకు కుదిస్తారా?

- పునర్విభజనకు సీఎం రేవంత్ రెడ్డి
- ఎన్నికల కోడ్ ముగియగానే ప్రక్రియ ప్రారంభం
- జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు యోచనలో ప్రభుత్వం




**ఖైరతాబాద్, ప్రజానావ:** జిల్లాల పునర్విభజనకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కసరత్తు ప్రారంభిం చింది. ప్రస్తుతం ఉన్న 33 జిల్లాలను 17 పార్లమెంట్ స్థానాల్లో ఒక్కో జిల్లా చొప్పున చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. గతంలోనే జిల్లాల విస్తరణ అశాస్త్రీయం గా ఉందని విమర్శించిన ముఖ్యమంత్రి ఆ దిశగా ముందుకెళు తున్నారు. జిల్లాల పునర్వి భజన ప్రక్రియను సమీక్షించేందుకు జ్యుడిషి యల్ కమిషన్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసే యోచనలో ఉంది. అయితే ఈ ప్రక్రియను ఎన్నికల కోడ్ ముగియగానే ప్రారంభించేలా కార్యాచరణ సిద్ధం చేసింది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అప్పటి కేసీఆర్ ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం పది జిల్లాలుగా ఉన్న తెలంగాణను ఆ తర్వాత 33 జిల్లాలుగా చేయడంతో తెలంగాణ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కొన్నిచోట్ల పాత జిల్లాలు ఐదు జిల్లాలుగా విడిపోవడంతో ప్రజలతో పాటు నాయకులు సైతం ఇబ్బందులు పడ్డారు. పరిపాలన లోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ పలువురు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినా అవేవీ ఆయన పరిగణలోకి తీసుకోకపోవడంతో ఆ తర్వాత అందరూ ఆ విషయాన్ని మరిచిపోయారు.

మిగతా 2 లో



## నేడు ఐదో దశ పోలింగ్

- ఓటర్లు భారీ సంఖ్యలో పాల్గొనాలని ఈసీ అభ్యర్థన
- ఓటింగ్ శాతం పెంచేందుకు మెట్రో నగరాల కమిషనర్లతో సమావేశం
- నాలుగు దశల్లో 66.95 శాతం పోలింగ్
- ఓటు హక్కు వినియోగిం చుకున్న 45.1 కోట్ల మంది

2 లో..

## 'సుచిత్ర' వివాదంపై విచారణ

- సర్వే నెం.82,83 స్థలాలపై సర్వే
- భారీగా మోహరించిన పోలీసులు
- పరిసరాల్లోకి ఇతరులకు అనుమతి నిరాకరణ

2 లో..



## నాగోల్ టు ఎయిర్ పోర్టు మెట్రో పనులు

- త్వరలో ప్రారంభం కానున్న రెండో దశ పనులు
- 14 కిలోమీటర్ల నిర్మాణానికి రూట్ ఖరారు
- శంషాబాద్ వరకు పొడిగించేలా రూట్ మ్యాప్
- మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి

2 లో..



## కేసీఆర్ క్షేమం కాదనే.. ప్రజలు ఇంటికి పంపించిన్రు

- చీమలపుట్టలో పాములు చేరినట్టు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది
- రాష్ట్రంలో మళ్లీ మామూళ్ల రాజ్యం మొదలైంది
- డబ్బులు ఇస్తే తప్ప పనులు జరిగే పరిస్థితి లేదు
- బీజేపీ సీనియర్ నేత, ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** పదేళ్ల పాలన తర్వాత కేసీఆర్ తీరును అర్థం చేసుకున్న ప్రజలు ఆయనను ముఖ్యమంత్రి కొనసాగించడం క్షేమం కాదని ఇంటికి పంపించారని ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఆయన నల్లగొండ-ఖమ్మం- వరంగల్ పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రేమేందర్ రెడ్డి తరఫున నల్లగొండలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ గురించి ప్రజల్లో చర్చనే లేదన్నారు. ఇక కాంగ్రెస్ చీమలు పెట్టిన పుట్టలో పాములు చేరినట్లుగా అధికారంలోకి వచ్చిందన్నారు. అనేక స్కాములు, అవినీతి కార్యక్రమాలకు నెలవు ఈ పార్టీ 40 ఏళ్లపాటు సగటు భారతీయుడు తలదించుకునే పరిస్థితి తీసుకొచ్చిందని విమర్శించారు. గతిలేక ప్రజలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. వారి డాబు.. దర్పం, వసూళ్లు మళ్లీ మొదలయ్యాయన్నారు. ఇప్పుడే ప్రజలు ఈ దౌర్జన్యం ఎలా భరించాలో అని భయపడుతున్నారని ఈటల పేర్కొన్నారు. ప్రేమేందర్ రెడ్డి 40 ఏళ్లుగా

మిగతా 2 లో

## ఒక్క కార్యకర్త కనిపించలేదా?

- సోనియా కొడుకు కోసం ఓట్లు అడుగుతున్నారు
- రాయ్‌బరేలీని సోనియా కుటుంబ ఆస్తిగా భావిస్తున్నారు
- కుటుంబ ఆధారిత పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- జంషెడ్‌పూర్ ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోడీ



**జంషెడ్‌పూర్:** సోనియాగాంధీ టార్గెట్‌గా ప్రధాని నరేంద్రమోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. రాయ్‌బరేలీని వదిలేసి, తన కొడుకు రాహుల్ గాంధీ కోసం సోనియాగాంధీ ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. కుటుంబ ఆధారిత పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆదివారం జంషెడ్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోడీ మాట్లాడుతూ సోనియా గాంధీ ప్రచారానికి వెళ్లి, తన కొడుకును వారికి అప్పగిస్తున్నానని చెబుతున్నారని, రాయ్‌బరేలీలో ఎక్కువ కాలం పార్టీ తరుపున పనిచేసిన ఒక్క కార్యకర్త కనిపించలేదా అని ప్రధాని ప్రశ్నించారు. సోనియా గాంధీ కోవిడ్ తర్వాత ఒక్కసారి కూడా తన నియోజకవర్గాన్ని సందర్శించలేదని, ఇప్పుడు తన కొడుకు కోసం ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. వారు రాయ్‌బరేలీని కుటుంబ ఆస్తిగా భావిస్తున్నారని మండిపడ్డారు. శనివారం రాయ్‌బరేలీలో జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న సోనియాగాంధీ, తన కుమారుడు(రాహుల్ గాంధీ)ని రాయ్‌బరేలీ ప్రజలకు అప్పగిస్తున్నానని, అతడు మిమ్మల్ని నిరాశ పరచడని ఆమె అన్న విషయం తెలిసిందే.

మిగతా 2 లో



## రాజకీయంగా ఎదగనివ్వకూడదనే బీజేపీ ఆపరేషన్ ఝాడూ

- త్వరలో ఆప్ బ్యాంక్ అకౌంట్లు కూడా ఫ్రీజ్ చేస్తారు
- ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్
- బీజేపీ ఆఫీస్ ముట్టడికి ఆప్ నాయకుల యత్నం

2 లో..



2 లో..


## మల్టీ లెవల్ కార్ పార్కింగ్‌పై దృష్టి పెట్టండి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్

## మార్కెట్ విలువను సవరించొద్దు

- అలాచేస్తే వ్యాపారం మరింత మందగిస్తుంది
- ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్న తెలంగాణ రియల్టర్లు

2 లో..



# 17 జిల్లాలకు కుదిస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

ఇదంతా గమనించిన కాంగ్రెస్ గత అసెంబ్లీ ఎన్నికల్లో తాము విజయం సాధిస్తే సమస్యను పరిష్కరిస్తామని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లింది. అంతేకాకుండా నూతన జిల్లాలు, మండలాల ఏర్పాటు హామీని మేనిఫెస్టో సైతం ఉంచింది. అప్పటి బహిరంగ సభల్లో కాంగ్రెస్ కొత్తగా ఏర్పాటు చేసే జిల్లాలకు మాజీ ప్రధాని పీవీ నరసింహా రావు పేరుతో పాటు జనగామ జిల్లాను సర్వార్ సర్వాయి పాపన్న గౌడ్ జిల్లాగా మారుస్తామని హామీ కూడా ఇచ్చింది. ఇందులో భాగంగానే జిల్లాల పునర్ వ్యవస్థీకరణ చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలోనూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇదే విషయాన్ని గుర్తుచేశారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ జిల్లాలను కుదిస్తుందని, మీకే ప్రమాదకరమని జనాలను ఉద్దేశించి మాట్లాడిన విషయం తెలిసిందే.

# నేడు ఐదో దశ పోలింగ్

- ఓటర్లు భారీ సంఖ్యలో పాల్గొనాలని ఈసీ అభ్యర్థన
- ఓటింగ్ శాతం పెంచేందుకు మెట్రో నగరాల కమిషనర్లతో సమావేశం
- నాలుగు దశల్లో 66.95 శాతం పోలింగ్
- ఓటు హక్కు వినియోగించుకున్న 45.1 కోట్ల మంది

**న్యూఢిల్లీ:** లోక్ సభ ఎన్నికలకు సంబంధించి పలు రాష్ట్రాల్లో సోమవారం ఐదో దశ ఓటింగ్ జరగనుంది. అందుకు సంబంధించి ఈసీ అన్ని ఏర్పాట్లు చేసింది. కాగా.. ఐదో విడత పోలింగ్‌కు ముందు ఓటర్లకు ఈసీ ప్రత్యేక విజ్ఞప్తి చేసింది. ఓటర్లు భారీ సంఖ్యలో పాల్గొని ఓటు వేయాలని కోరింది. ముఖ్యంగా పట్టణ ప్రజలకు ఎన్నికల సంఘం ప్రత్యేక అభ్యర్థన చేసింది. ముంబై, థానే, లక్నో వంటి నగరాల్లో గత ఎన్నికల్లో ఓటింగ్ పట్ల తేడా కనిపించిందని కమిషన్ చెబుతోంది. ఇతర నగరాలతో పోలిస్తే మెట్రోపాలిటన్ నగరాల్లో రెండో దశలో కూడా ఓటింగ్ తక్కువగా నమోదైందని కమిషన్ తెలిపింది. ఇలాంటి పరిస్థితుల్లో ఓటింగ్‌కు ముందు పెద్ద నగరాల ఓటర్లు అధిక సంఖ్యలో ఓటు వేయాలని, తక్కువ ఓటింగ్ శాతం ధోరణిని మార్చాలని కమిషన్ ప్రత్యేక విజ్ఞప్తి చేసింది. మరోవైపు.. పట్టణ ఓటర్లలో ఓటింగ్ శాతాన్ని పరిష్కరించడానికి ఈసీ.. మెట్రో నగరాల కమిషనర్లతో సమావేశాన్ని నిర్వహించింది. గత నాలుగు దశల్లో ఇప్పటి వరకు 66.95 శాతం ఓటింగ్ జరిగినట్లు కమిషన్ వెల్లడించింది. ఇందులో దాదాపు 45.1 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మొత్తం ఓటర్ల సంఖ్య సుమారు 97 కోట్లు ఉన్నారు.

### 379 స్థానాలకు ఓటింగ్ పూర్తి..

నాలుగు దశల్లో జరిగిన ఓటింగ్‌లో ఇప్పటివరకు 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 379 స్థానాలకు ఓటింగ్ పూర్తయింది. సోమవారం ఐదో దశ ఎన్నికల్లో బీహార్, జమ్మూ కాశ్మీర్, లడఖ్, జార□ండ్, మహారాష్ట్ర, ఒడిశా, ఉత్తరప్రదేశ్ మరియు పశ్చిమ బెంగాల్‌తో సహా ఎనిమిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 49 స్థానాలకు ఓటింగ్ జరగనుంది. దీంతో పాటు ఒడిశాలోని 35 అసెంబ్లీ స్థానాలకు కూడా సోమవారం ఓటింగ్ జరగనుంది. ఈ సమయంలో 94,732 పోలింగ్ కేంద్రాల వద్ద 9.47 లక్షల మంది పోలింగ్ అధికారులను నియమించనున్నారు. ఐదో దశలో మొత్తం 8.95 కోట్లకు పైగా ఓటర్లు ఉన్నారు. వీరిలో 4.69 కోట్ల మంది పురుషులు, 4.26 కోట్ల మంది మహిళలు మరియు 5409 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు.

# నాగోల్ టు ఎయిర్ పోర్టు మెట్రో

- త్వరలో ప్రారంభం కానున్న రెండో దశ పనులు
- 14 కిలోమీటర్ల నిర్మాణానికి రూట్ ఖరారు
- శంషాబాద్ వరకు పొడిగించేలా రూట్ మ్యాప్
- మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడం కోసం ప్రతిష్టాత్మకంగా మెట్రో సర్వీస్ ను అందుబాటులోకి తీసుకొచ్చారు. మొదటి దశలో పూర్తైన మెట్రోకు భారీ స్పందన రావడంతో రెండో దశ మెట్రో లైన్ ఏర్పాటుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పలు మార్గాల్లో ప్రాజెక్టు నిర్మాణం కోసం రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని సంస్థను ఆదేశించింది. దీంతో నాగోల్ నుంచి చంద్రయణగుట్ట వరకు దాదాపు 14 కిలోమీటర్ల మెట్రోను నిర్మించడా నికి రూట్ ఖరారు చేసిట్లు మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ శివారు లో ఉన్న శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు మెట్రో లైన్ పొడిగించే విధంగా ఈ రూట్ మ్యాప్ తయారు చేసినట్లు తెలిపారు. ఈ లైన్ నాగోల్ మెట్రో స్టేషన్ నుంచి ప్రారంభమై నాగోల్ చౌరస్తా, అల్కాపురి చౌరస్తా, కామినేని ఆస్పత్రి, ఎల్బీనగర్ సర్కిల్, సాగర్ రింగ్ రోడ్, మైత్రి నగర్ మీదుగా చంద్రయణగుట్ట వరకు మొత్తం 14 స్టేషన్లు వస్తాయని వారు పేర్కొన్నారు. ఈ రూట్ మ్యాప్ కూ ప్రభుత్వం అంగీరించి, లాండ్ పుల్లింగ్ చేస్తే.. అతి త్వరలోనే మెట్రో రెండో దశ పనులు ప్రారంభం అవ్వనున్నాయి.

# మార్కెట్ విలువను సవరించొద్దు

**ఖైరతాబాద్, ప్రజానావ :** ఇప్పటికే మందగమనంలో ఉన్న తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగానికి మార్కె ట్ విలువలను సవరించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన చర్య దెబ్బతింటుందా? ఆదాయాన్ని పెంచుకోవడంపై ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ఇటీవల నిర్వహించిన సమీక్షా సమావేశం తర్వాత చర్చనీయాంశంగా మారి న ఈ చర్యపై బిల్డర్లు, డెవలపర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్దిష్ట సమయంలో మార్కెట్ విలువలను సవరించడం వల్ల వ్యాపా రం మరింత మందగించవచ్చని వారు భయపడుతున్నారు. గతేడాది చివర్లో ఎన్నికలు ప్రకటించినప్పటి నుంచి ఇది మందగమనంలో ఉంది. వివిధ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఇప్పటికీ అస్పష్టంగా ఉన్నాయని, ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుం టే, ఇటువంటి కసరత్తులు చేపట్టడానికి ఇది సరైన సమయం కాదని బిల్డర్లు భావిస్తున్నారు. ఇటీవల స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారు లతో జరిగిన సమావేశంలో భూముల మార్కె ట్ విలువను సవరించేందుకు చర్యలు తీసు కోవాలని ముఖ్యమంత్రి ఆదేశించిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా భూములు, ఆస్తుల విలువలు భారీగా పెరిగాయని, అయితే స్టాం పులు, రిజిస్ట్రేషన్‌ల ద్వారా వచ్చే ఆదాయం అందుకు అనుగుణంగా పెరగలేదన్నారు. మా ర్కెట్ విలువ మరియు భూమి లేదా ఆస్తుల వాస్తవ అమ్మకపు ధర మధ్య వ్యత్యాసం ఉందని, రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహించ డానికి మరియు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడానికి మార్కెట్ విలువను సవరించాలని ఆయన సూచించారు.

### ఇది సరైన సమయం కాదు..

ప్రతి సంవత్సరం మార్కెట్ విలువలను సవరిం చాలనే నిబంధన ఉందని అంగీకరించిన క్రెడాయ్ హైదరాబాద్ సభ్యుడు, విలువలను సవరించడానికి ఇది సరైన సమయం కాదని గమనించారు. గత ఆరు నెలల నుంచి మార్కెట్ చాలా నెమ్మదిగా ఉందని, ఈ ప్రకట నలు మరింత మందగించవచ్చని ఆయన అన్నారు. ధరలపై అనిశ్చితి ఉన్నందున వినియోగదారులు వేచి ఉండవలసి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అయిందని, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచేందుకు, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ బూమ్‌ను పెంచే విధంగా చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడేళ్లు అధికారంలో ఉన్న తర్వాత జూలై 2021లో రిజిస్ట్రేషన్ ఛార్జీలను 6 శాతం నుంచి 7.5 శాతానికి సవరించింది. ఫిబ్రవరి 2022లో, మార్కెట్ విలువలు సవరించబ డ్డాయి, అయితే పెరుగుతున్న భూముల విలు వలను పరిగణనలోకి తీసుకుంటే, లావాదేవీ లపై ఎటువంటి ప్రభావం లేదని బిల్డర్ చెప్పారు. ఈ ప్రాంతంలోని రియల్ ఎస్టేట్‌పై ప్రభావం చూపే ఫార్మా సిటీ ప్రాజెక్టును రద్దు చేయాలని అభిప్రాయపడుతున్నారు.

# కేసీఆర్ క్షేమం కాదనే..

# ప్రజలు ఇంటికి పంపించిన్రు

(మొదటిపేజీ తరువాయి)

నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేస్తున్నారని, పార్టీ.. ప్రజలు తప్ప వేరే ఆలోచన లేని వ్యక్తి అని కొనియాడారు.

### సంకీర్ణ రాజకీయాలకు స్వస్థి పలికిన మోడీ

నరేంద్ర మోడీ అధికారం చేపట్టిన తర్వాత సంకీర్ణ రాజకీయాలకు స్వస్తి పలికారని, నాయకుడు అంటే ఇలా ఉండాలి అంటూ దేశానికి గొప్ప విశ్వాసాన్ని కలిగించారన్నారు. ప్రపంచంలో దేశ ఔన్నత్యాన్ని పెంచారని, అమెరికా సైతం వారి సెనెట్లో మోడీ.. మోడీ అంటూ నినాదాలు చేసే స్థాయికి ఎదిగామన్నారు. రష్యా ఉక్రెన్ యుద్ధంలో మధ్యవర్తిగా వ్యవహరించాలని రష్యా లేఖ రాయడం మన స్థాయిని తెలియజేస్తుందని గుర్తుచేశారు. కరోనా కాలంలో ధైర్యం అందించడమే కాకుండా అతి తక్కువ కాలంలో వ్యాక్సిన్ తయారుచేసి ప్రపంచ దేశాలకు అందించిన ఘనత మోడిదన్నారు. 11వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ ఐదో ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, మూడో స్థానానికి తీసుకురావడమే లక్ష్యంగా మోడీ పనిచేస్తున్నారని చెప్పారు. 370 ఆర్టికల్ రద్దుచేసి జమ్మూ కాశ్మీర్ ను భారత్‌లో భాగమే కన్నెత్తి చూడొద్దు అని హెచ్చరిక జారీ చేసిన నాయకుడు నరేంద్ర మోడీ అని, లాల్ చౌక్ లో స్వేచ్ఛగా ఈరోజు త్రివర్ణ పతకాన్ని ఎగరవేస్తున్నామంటే దానికి మోడీయే కారణమన్నారు. రాజకీయాల్లోనూ బీజేపీ సామాజిక సమతుల్యాన్ని పాటించిందని ఈటల పేర్కొన్నారు. 27 మంది ఓబీసీ, 12 మంది దళిత, ఎనిమిది మంది గిరిజన, ఐదుగురు మైనారిటీ మంత్రులు ఉన్న ఏకైక క్యాబినెట్ నరేంద్ర మోడీదేనన్నారు. ఒక మహిళను ఆర్థిక మంత్రి చేసిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో వెంకటయ్య, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు రామచంద్రరావు, జనార్దన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

### ఆరు నెలలైనా హామీల ఊసేలేదు..

రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువుతీరి దాదాపు ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల ఊసేలేదని ఈటల విమర్శించారు. ఎన్నికల ముందు గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఓట్లు వేయరేమో అన్న భయంతో దేవుళ్ల మీద ప్రమాణం చేసి రూ. 2లక్షల రుణమాఫీ చేస్తానని ప్రగల్భాలు పలికారు తప్ప దాన్ని అమలు చేయాల్సిన విశ్వాసం కనిపిస్తలేదన్నారు. మహిళలకు రూ. 2500, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, చదువుకునే ఆడపిల్లలకు స్కూటీలు, రూ. 4000 పింఛన్ ఏది అమలు కాకపోగా.. చివరికి మళ్లీ కరెంటు కోతల మొదలయ్యాయన్నారు. రాష్ట్రంలో మళ్లీ మామూళ్ల రాజ్యం మొదలైందని, డబ్బులు ఇస్తే తప్ప పనులు జరిగే పరిస్థితి లేదని వాపోయారు.



# 'సుచిత్ర' వివాదంపై విచారణ

- సర్వే నెం.82,83 స్థలాలపై సర్వే
- భారీగా మోహరించిన పోలీసులు
- పరిసరాల్లోకి ఇతరులకు అనుమతి నిరాకరణ

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి స్థల వివాదంపై విచారణ కొనసాగు తోంది. సుచిత్రలోని 82, 83 సర్వే నంబర్లలోని స్థలానికి వెళ్లిన రెవెన్యూ అధికారులు సంబంధిత పత్రాలను పరిశీలిం చారు. భూ సర్వే కూడా చేస్తున్నారు. కాగా, ఎలాంటి వివాదం తలెత్తకూడదనే ఉద్దేశంతో ముందస్తుగా అక్కడ పోలీ సులను మోహరించారు. పరిసరాల్లోకి ఎవరినీ అనుమతిం చడం లేదు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి వాంగ్మూలం నమోదు చేశారు. అయితే నోటీసులు ఇవ్వకుండా సర్వే చేయడాన్ని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి రెవెన్యూ అధికారులను తప్పుబట్టారు. 13 ఏళ్ల క్రితం భూమి కొనుగోలు చేసి ఆస్తి పన్ను చెల్లిస్తున్నామని చెప్పారు. 2011లో తాను, మల్లారెడ్డి ఈ భూమిని కొనుగోలు చేశానని.. ఆ సమయంలో రాజకీయాల్లోకి రాలేదని స్పష్టం చేశారు. చట్టపరంగా రావాలని కొందరు వివాదం సృష్టిస్తున్నారని వాపోయారు. మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు రాజశేఖర్ రెడ్డికి సంబంధించిన భూమి కోర్టు వివాదంలో ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మల్లారెడ్డి, ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి తమ అనుచరులతో కలిసి ఈ స్థలాన్ని కొందరు కబ్జా చేస్తున్నారని ఆరోపిస్తూ ఆ స్థలంలో వేసిన బారికేడ్లను నిన్న తొలగించారు. దీంతో ఆ సమయంలో అక్కడే ఉన్న 15 మందితో మల్లారెడ్డి-రాజశేఖర్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. పోలీసులు వారిని ఒప్పించే ప్రయత్నం చేశారు. సుచిత్ర పరిధిలోని సర్వే నంబర్ 82లో ఉన్న రెండున్నర ఎకరాల భూమి తమదేనని మల్లారెడ్డి పేర్కొనగా, మిగిలిన 15 మంది 1.11 ఎకరాలు తమదని, ఒక్కొక్కరు 400 గజాలు కొనుగోలు చేశామని పేర్కొన్నారు. కోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందన్నారు. ఈ క్రమంలో ఇరువర్గాలకు పోలీసులు సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అయితే మల్లారెడ్డి పోలీసుల మాట వినకుండా.. ఆయన అనుచరులను ఫెన్సింగ్ నుంచి తప్పించాలని అన్నారు. ఈ క్రమంలో మల్లారెడ్డి, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. కేసు పెడితే పెట్టుకోండి.. నా స్థలాన్ని నేను కాపాడుకుంటా అంటూ మల్లారెడ్డి పోలీసులతో చెప్పడంతో అక్కడ మరింత ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితి చేయి దాటిపోవడంతో పోలీసులు మల్లారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. సుచిత్ర పరిధిలోని సర్వే నంబర్ 82 భూ వివాదం కేసులో మాజీ మంత్రి మల్లారెడ్డిని అరెస్ట్ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మల్లారెడ్డిని పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మల్లారెడ్డి అరెస్ట్ తో బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# రాజకీయంగా ఎదగనివ్వకూడదనే

# బీజేపీ ఆపరేషన్ ఝూదూ

- త్వరలో ఆప్ బ్యాంక్ అకౌంట్లు కూడా ఫ్రీజ్ చేస్తారు
- ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్
- బీజేపీ ఆఫీస్ ముట్టడికి ఆప్ నాయకుల యత్నం

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీ హైటెన్షన్ వాతావరణం నెలకొంది. బెయిల్ పై వచ్చిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. ఆమ్ ఆద్మీ పార్టీ అగ్ర నేతలు రాజకీయంగా ఎదగనివ్వకుండా బీజేపీ అరెస్ట్ చేయడానికి బీజేపీ ఆపరేషన్ ఝూదూ ప్రారంభించిందని అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఆప్ లీడర్ల బీజేపీకి సవాల్ గా మారుతున్నారని అందుకే ఆపరేషన్ ఝూదూతో వాళ్లని అరెస్ట్ చేస్తున్నారని, ఆప్ బ్యాంక్ అకౌంట్లు కూడా త్వరలో ఫ్రీజ్ చేస్తారని కేజ్రీవాల్ చెప్పుకొచ్చారు. ఆదివారం ఆయన ఢిల్లీ పార్టీ ఆఫీస్ లో మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరం ఢిల్లీ బీజేపీ ఆఫీస్ ముట్టడికి ఆప్ నాయకులు ర్యాలీగా బయలుదేరారు. ఆప్ ఎంపీ పైన సొంత పార్టీ నాయకుడి పీఏనే తనపై దాడి చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేజ్రీవాల్ పీఏ బిభవ్ కుమార్ ను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. హజారీ కోర్టు ఆయనకు 5 రోజుల పోలీస్ కస్టడీ విధించింది. ఈ అరెస్ట్ కు నిరసనగా ఆప్ ఢిల్లీ బీజేపీ ఆఫీస్ ముందు నిరసన చేస్తోంది. ఈ కార్యక్రమానికి ఢిల్లీ ఆమ్ ఆద్మీ నాయకులతో పాటు ఇండియా కూటమి నాయకులు కూడా వస్తున్నారు.



ఢిల్లీలోని డీడీయూ మార్గ్ లో ఉన్న బీజేపీ హెడ్ ఆఫీస్ ముందు నిరసన తెలపడానికి జైల్ భరో మార్చ్ చేస్తున్నారు. మరోవైపు ర్యాలీకి అనుమతి లేదని ఢిల్లీ పోలీసులు హెచ్చరిస్తున్నారు. బీజేపీ ఆఫీస్ వద్ద 144 సెక్షన్ విధించారు. డీడీయూ మార్గ్‌లోని బీజేపీ కార్యాలయంలో భద్రతను ఏర్పాటు చేశారు. పోలీసులు బార్కేట్లు పెట్టి, భారీగా మోహరించారు. ఆప్ నాయకులు ఇప్పుడే ర్యాలీగా రోడ్లపైకి చేరుతున్నారు. వారిని పోలీసులు చెదరగొడుతున్నారు.

# ఒక్క కార్యకర్త కనిపించలేదా?

(మొదటిపేజీ తరువాయి)

మరోవైపు రెండు స్థానాల నుంచి పోటీ చేస్తున్న రాహుల్ గాంధీని ఉద్దేశించి ప్రధాని విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ యువరాజు వయనాడ్ నుంచి రాయ్‌బరేలీకి పారిపోయాడని, ఇది తన తల్లి సీటు అని అందరికీ చెబుతూ తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. "8 ఏళ్ల పిల్లాడు చదువుకోవడానికి బడికి వెళ్లినప్పుడు కూడా తన నాన్న చదివిన బడి అయినప్పటికీ ఇది మా నాన్న బడి అని చెప్పడని, కాంగ్రెస్ పార్లమెంట్ స్థానాన్ని తన పూర్వీకుల ఆస్తిగా భావిస్తోంది. జార□ండ్ అలాంటి కుటుంబ ఆధారిత పార్టీల నుంచి రక్షించబడింది"అని ప్రధాని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా 5వ విడతలో ఉత్తర్ ప్రదేశ్‌లోని అమేథీ, రాయ్‌బరేలీలకు మే 20న ఎన్నికలు జరగబోతున్నాయి. గతంలో కాంగ్రెస్ కంచుకోటలుగా ఉన్న ఈ స్థానాలను మళ్లీ దక్కించుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. 2019 ఎన్నికల్లో అమేథీలో కేంద్రమంత్రి స్మృతీ ఇరానీ చేతిలో ఓడిపోయారు. 2004 నుంచి రాయ్‌బరేలీకి ఎంపీగా ఉన్న సోనియా గాంధీ రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. దీంతో ఈ స్థానం నుంచి రాహుల్ గాంధీ పోటీ చేస్తున్నారు.

# మల్టీ లెవల్ కార్ పార్కింగ్‌పై దృష్టి పెట్టండి

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** ఎంఎల్‌సీపీ (ఆటోమేటెడ్, కంప్యూటరైజ్డ్ మల్టీ లెవల్ కార్ పార్కింగ్) పనులు దాదాపు పూర్తి కావడం పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. నాంపల్లి మెట్రో స్టేషన్ సమీపంలో ఈ మల్టీలెవల్ కార్ పార్కింగ్‌ను పీపీపీ విధానంలో 2016/17లో నిర్ణయించినట్లు తెలిపారు. కానీ కొన్ని కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ ఆలస్యమై ఎట్టకేలకు పూర్తి కావచ్చిందన్నారు. ఇలాంటి మల్టీలెవల్ కార్ పార్కింగ్ విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరింత ముందుకు తీసుకెళ్లాలని కేటీఆర్ అన్నారు. ముఖ్యమైన జంక్షన్లు, మెట్రో స్టేషన్లు, వాణిజ్య కేంద్రాల దగ్గర ఇలాంటి మరిన్ని నిర్మించాలని ఆయన ట్వీట్ చేశారు. కాగా.. నాంపల్లి మెట్రో స్టేషన్ సమీపంలోని హెచ్ఎంఆర్ఎల్‌కు చెందిన అర ఎకరం స్థలంలో 15 అంతస్తుల్లో కాంప్లెక్స్‌ను నిర్మించనున్నారు. ఇందులో 10 అంతస్తుల్లో వాహనాల పార్కింగ్ సౌకర్యాలు, ఐదు అంతస్తుల్లో వాణిజ్య దుకాణాలు, రెండు స్క్రీన్లతో సినిమా థియేటర్ ఉన్నాయి. మొత్తం 1,44,440 చదరపు అడుగుల విస్తీర్ణంలో 68 శాతం పార్కింగ్‌కు, 32 శాతం వాణిజ్య సముదాయాలకు కేటాయించారు.

### వాహనదారులకు స్మార్ట్ కార్డ్ జారీ..

పార్కింగ్ స్థలంలో 250 కార్లు, 200 ద్విచక్ర వాహనాలు ఉంటాయి. కాంప్లెక్స్ యొక్క గ్రౌండ్ ఫ్లోర్‌లో 4 ఇన్‌బౌండ్ మరియు అవుట్‌బౌండ్ టెర్మినల్స్ ఉన్నాయి. వాహనాలు ఆపేందుకు టర్న్‌టేబుల్స్ ఏర్పాటు చేశారు. వాహనదారుడు తమ వాహనాన్ని ఈ టేబుల్‌పై ఉంచి, వారి నిర్దేశించిన పనులకు వెళ్లవచ్చు. ఎంఎల్‌పీలోకి వాహనం ప్రవేశించే సమయంలో వాహనదారులకు స్మార్ట్ కార్డ్ జారీ చేయబడుతుంది. తరచుగా ఎంఎల్‌పి వినియోగదారులకు ఆర్ఎఫ్ఐడీ కార్డులు జారీ చేయబడతాయి. వాహనం యొక్క కొలతలు ఆధారంగా కంప్యూటరైజ్డ్ పార్కింగ్ సిస్టమ్ ద్వారా వాహనాల వర్గీకరణ జరుగుతుంది. ఎస్‌యూవీ లేదా సెడాన్ వాహనం ప్రకారం పార్కింగ్ సౌకర్యం కేటాయించబడుతుంది. ట్రాన్స్‌పోర్టర్ షటిల్ వాహనాన్ని లిఫ్ట్ ద్వారా నిర్ణీత అంతస్తులో నిర్ణీత అంతస్తులో పార్క్ చేస్తుంది. పార్క్ చేసిన వాహనాన్ని తిరిగి పొందడానికి, డ్రైవర్ పార్కింగ్ రుసుము చెల్లించి, కార్డ్ రీడర్‌కు పార్కింగ్ టిక్కెట్‌ను అందించిన తర్వాత ట్రాన్స్‌పోర్టర్ షటిల్ ఆటోమేటిక్‌గా కారును వాహనదారుడికి అందజేస్తుంది. పార్కింగ్ కోసం ఒక నిమిషం కంటే తక్కువ సమయం, తిరిగి రావడానికి 2 నిమిషాలు పడతుందని పేర్కొన్నారు.




# ఖర్గే పోస్టర్లపై ఇంక్ దాడి

**• ఘటనపై అధిర్ రంజన్ అసంతృప్తి • పోలీసులకు ఫిర్యాదు**

**కోల్‌కతా:** ఇండియా కూటమికి బయట నుంచి మద్దతు ఇస్తానని ఇటీవల బెంగాల్ సీఎం, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ ప్రకటించింది. అయితే, ఆమె ప్రకటనపై బెంగాల్ కాంగ్రెస్ చీఫ్ అధిర్ రంజన్ చౌదరి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆమె విధేయతను ప్రశ్నించడంతో పాటు ఆమెపై తనకు నమ్మకం లేదని అన్నారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అసంతృప్తి వ్యక్తం చేసిన ఒక రోజు తర్వాత బెంగాల్ వ్యాప్తంగా కాంగ్రెస్‌కి అవమానం జరిగింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉన్న అనేక పోస్టర్లు, హోర్డింగులపై ఇంక్ దాడి జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు పోస్టర్లలో ఖర్గే ముఖానికి సిరా పూశారు. "తృణమూల్ కాంగ్రెస్ ఏజెంట్" అని రాశారు. ఈ ఘటనపై అధిర్ రంజన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయాలని పార్టీ కార్యకర్తలను ఆదేశించారు. దీనిపై ఫిర్యాదు నమోదైంది. ధ్వంసం చేసిన పోస్టర్లను తొలగించారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. శనివారం రాత్రి ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఖర్గే, అధిర్ రంజర్ మధ్య విభేదాలు సృష్టించాలని టీఎంసీ ఇలా చేసి ఉంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. మమతపై అధిర్ రంజన్ విమర్శలపై ఖర్గే స్పందిస్తూ.. "మమతా బెనర్జీ కూటమితోనే ఉన్నారు.. ప్రభుత్వంలో చేరతామని ఇటీవలే చెప్పారు. అధిర్ రంజన్ చౌదరి నిర్ణయం తీసుకోరు. నేనే, హైకమాండ్ నిర్ణయం తీసుకుంటామని, అంగీకరించని వారు బయటకు వెళ్తారు." అని అన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇండియా కూటమి అధికా రంలోకి తర్వాత కూటమిలో భాగం అవ్వా లా..? వద్దా..? అనేదానిపై అధిర్ రంజన్ నిర్ణయం తీసుకోరని ఆయన అన్నారు.

**అలాంటి వ్యక్తికి అనుకూలంగా మాట్లాడలేను..**

అంతకుముందు అధిర్ రంజన్, మమతా బెనర్జీని ఉద్దేశించి మాట్లాడుతూ బెంగాల్‌లో నన్ను, మా పార్టీని రాజకీయంగా అంతం చేయాలనుకునే వ్యక్తికి నేను అనుకూలంగా మాట్లాడలేను. ఇది ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త కోసం పోరాటం, రాష్ట్ర కాంగ్రెస్‌ని ఆమె వ్యక్తిగత ఎజెండా కోసం ఉపయోగించుకోవడం నాకు ఇష్టం లేదు అని అన్నారు. ఖర్గే నా అభిప్రాయానికి వ్యతిరేకంగా మాట్లాడితే, రాష్ట్రంలోని అట్టడుగు స్థాయి కాంగ్రెస్ కార్యకర్త కోసం నేను మాట్లాడుతుతాను అని అన్నారు. బెంగాల్‌లో టీఎంసీ ఒంటరిగా పోటీ చేస్తుండగా, కాంగ్రెస్-వామపక్షాలు పొత్తులో పోటీ చేస్తున్నాయి.

# నేటి నుంచి యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి జయంత్యుత్సవాలు

## రెండ్రోజుల పాటు వేడుకలు : ఈవో భాస్కర్‌రావు



**యాదాద్రి భువనగరి, ప్రజానావ:** యాదగిరిశుడి ఆలయంలో సోమవారం నుంచి రెండ్రోజుల పాటు లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో భాస్కర్ రావు తెలిపారు. యాదగిరిగుట్టతో పాటు అనుబంధ ఆలయాలైన పాతగుట్ట, దబ్బకుంటపల్లిలో కూడా వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20వ తేదీ ఉదయం స్వస్తివచనం, పుణ్యాహవచనం, లక్ష కుంకుమార్చన పూజలతో పాటు తిరువేంకటపతి అలంకార సేవోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం మృత్స్యం గ్రహణం, అంకురార్పణ, హవనం, గరుడ వాహనం, పరవాసుదేవ అలంకార సేవలు నిర్వహిస్తారు. 21న ఉదయం నిత్యమూలమంత్ర హవనం, లక్షపుష్పార్చన, కాళీయ మర్ధన అలంకార సేవోత్సవం ఉంటాయన్నారు. సాయంత్రం నారసింహ మూల మంత్ర హవనం, నిత్య పూర్ణాహుతి, గర్భాలయంలో మూలాలకు సహస్ర కలశాభిషేకం, రాత్రి నరసింహ జయంతి, ఆవిర్భావ, మహానివేదన ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. పాతగుట్ట ఆలయం యథావిధిగా కొనసాగుతుందని ఆలయ ఈఓ తెలిపారు. దబ్బకుంటపల్లి నరసింహస్వామి ఆలయంలో ఈ నెల 22న ఉదయం 11 గంటలకు స్వస్తివాచనం, విశ్వక్సేనపూజ, అభిషేకం, స్వామివారి కల్యాణం, మహానివేదన, తీర్థప్రసాద గోష్టి ఆశీర్వాదం ఉంటాయన్నారు.

**ఆలయ పరిసరాల్లో ప్లాస్టిక్ నిషేధం**

మరోవైపు పర్యావరణ పరిరక్షణలో భాగంగా యాదాద్రి ఆలయ పరిసరాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తూ కార్యనిర్వహణాధికారి ఎ.భాస్కరరావు ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థానంలోని పలు శాఖలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా ప్లాస్టిక్ యేతర వస్తువులను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ఈ నిషేధాన్ని పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. దీని ప్రకారం ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, ప్లాస్టిక్ కవర్ల స్థానంలో నాన్ ప్లాస్టిక్ వస్తువులు పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నిత్యకల్యాణం, హోమం, జోడు సేవల వంటి వివిధ ఆర్జితసేవల్లో పాల్గొనే భక్తులు తప్పనిసరిగా సంప్రదాయ దుస్తులు ధరించాలని ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

**ఇక కఠిన నిబంధనలు**

జూన్ 1 నుంచి ఆలయంలో నిబంధనలు కఠినంగా అమలు చేయనున్నామని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగానే యాదాద్రిలో వీఐపీ బ్రేక్ దర్శనానికి భక్తులు డ్రెస్ కోడ్ పాటించాలని ఆలయ ఈఓ తెలిపారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఈ నిబంధన తప్పనిసరిగా వర్తిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా నిత్యం ధర్మ దర్శనం కోసం క్యూ లైన్ లో వచ్చే భక్తులకు ఈ నిబంధన వర్తించదని పేర్కొన్నారు.




# లాభాల బాటలో సింగపూర్ ఎయిర్ లైన్స్

## ఉద్యోగులకు 8నెలల జీతం బోనస్

**కౌలలాంపూర్:** ప్రముఖ విమానయాన సంస్థ సింగపూర్ ఎయిర్ లైన్స్ ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. అంచనాలకు మించి లాభాలు నమోదు చేసిన క్రమంలో తమ ఉద్యోగులకు బంపర్ ఆఫర్ అందించాలని నిర్ణయించింది. 8 నెలల జీతాన్ని బోనస్‌గా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. కోవిడ్ విజృంభణతో దాదాపు అన్ని ఎయిర్‌లైన్ సంస్థలు నష్టాల్లోకి జారుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత పరిస్థితులు అనుకూలించి చైనా, హాంకాంగ్, జపాన్, తైవాన్ దేశాల సరిహద్దులు పూర్తిగా తెరచుకోవడమే తిరిగి సంస్థ లాభాల బాట పట్టేందుకు కారణమని సింగపూర్ ఎయిర్‌లైన్స్ తెలిపింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో విమానయాన సంస్థ రికార్డ్ స్థాయిలో 1.98 బిలియన్ డాలర్ల వార్షిక నికర లాభాన్ని నమోదు చేసింది. దీంతో మార్చి నెల ముగిసే నాటికి కంపెనీ నికర ఆదాయం 24 శాతం పెరిగి 2. 7 బిలియన్ డాలర్లకు చేరుకుంది. తమ ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణ వసతులు కల్పించడం సహా తమ ఉద్యోగుల మెరుగైన పనితీరే ఈ వృద్ధికి కారణమని సింగపూర్ ఎయిర్ లైన్స్ తెలిపింది. అందుకే లాభాల్లో కొంత భాగాన్ని ఉద్యోగులకు బోనస్‌గా అందించనున్నట్లు సింగపూర్ ఎయిర్ లైన్స్ ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీ ఏకంగా 36. 4 మిలియన్ల మంది ప్రయాణికులకు సేవలు అందించినట్లు వెల్లడించింది. ఇలా కంపెనీ ఆర్జించిన లాభాలను బోనస్ రూపంలో ఉద్యోగులకు ఇవ్వడం ఇదే తొలిసారి కాదు. గతంలో దుబాయ్ ఎమిరేట్స్ కూడా ఇలానే 20 వారాల జీతాన్ని బోనస్ గా అందించింది. ఇలా ఉద్యోగులను సైతం ఉత్సాహంగా పనిచేసేట్లు చేస్తోంది.

**నియంత్రణ పేరుతో తొలగింపు..**

కాగా.. ఇటీవల గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ కంపెనీలో ఖర్చుల నియంత్రణ పేరుతో భారీగా ఉద్యోగులను తొలగిస్తున్న సంగతి తెలిసిందే. ఇలాంటి కష్టకాలంలో ఉన్న ఉద్యోగం ఊడకుండ ఉండాలనే ఉద్యోగులు ఆశిస్తున్నారు. అలాంటిది బోనస్, ఇంక్రిమెంట్లు వంటి వాటి గురించి ఆలోచించే పరిస్థితులు అస్సలు కనిపించడం లేదు. ఐటీ, టెక్ కంపెనీల తర్వాత విమానయాన రంగంలో ఉద్యోగాల కోతలు ఎక్కువగా ఉన్నాయి. కరోనాతో విమానయాన రంగం భారీగా దెబ్బతిన్నదని చెప్పవచ్చు. ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పెద్ద పెద్ద కంపెనీలు ఉద్యోగులను తొలగిస్తున్న తరుణంలో తమ ఉద్యోగులకు ఏకంగా 8 నెలల జీతాన్ని బోనస్‌గా అందిస్తామని సింగపూర్ ఎయిర్ లైన్స్ తెలపడం ఆసక్తిగా మారింది.



# చెప్పుల వ్యాపారుల ఇంట్లో ఐటీ తనిఖీలు

**గుట్టలు గుట్టలుగా నగదు లభ్యం**

**ఆగ్రా:** ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఆదాయపు పన్ను శాఖ భారీ చర్యలు చేపట్టింది. ఆగ్రా నగరంలోని ముగ్గురు చెప్పుల వ్యాపారుల స్థలాలు, సంస్థలపై అకస్మిక తనిఖీలు చేపట్టింది. ఐటీ శాఖ సోదాల్లో లెక్కకు మిక్కిలి ఆస్తులు లభ్యమయ్యాయి. ఇప్పటి వరకు రూ.40 కోట్ల నగదు దొరికిందని, మిగిలిన నగదును లెక్కిస్తున్నామని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. దాడి సమయంలో షూ వ్యాపారి ఇంట్లో నోట్ల కుప్పలు గుర్తించినట్టుగా తెలిసింది. అందిన సమాచారం మేరకు ఆదాయపు పన్ను శాఖ దాడులు అర్థరాత్రి వరకు కొనసాగాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ఆగ్రాలోని ఎంజీరోడ్‌కు చెందిన బీకే షూష్, ధక్రాన్‌కు చెందిన మన్షు ఫుట్‌వేర్, ఆసుఫోటిడా మండికి చెందిన హర్మిలాప్ ట్రేడర్స్‌పై ఆదాయపు పన్నుశాఖ శనివారం దాడులు జరిపింది. ఐటీ సోదాల్లో నగదుతో పాటు ల్యాప్‌టాప్, మొబైల్, పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. భూమి, బంగారంపై పెట్టుబడులకు సంబంధించిన పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. అల్మారాలు, షూ బాక్సులు, మంచాల్లో కరెన్సీ నోట్ల కట్టలు కనిపించాయి. రాత్రి 2 గంటల సమయంలో నోట్లు లెక్కించే యంత్రాలు వేడెక్కడంతో ఇతర యంత్రాలను రప్పించారు. 100 కోట్లకు పైగా అప్రకటిత ఆదాయాన్ని సరెండర్ చేసే అవకాశం ఉందని ఆదాయపు పన్ను శాఖ అధికారులు వెల్లడించారు.

**పక్కా సమాచారం మేరకే..**

చెప్పుల వ్యాపారులు ఆదాయపు పన్ను ఎగవేస్తున్నట్లు నిఘా వర్గాల నుంచి ఆదాయపు పన్ను శాఖకు సమాచారం అందింది. పక్కా సమాచారం మేరకు అధికారులు దాడులకు దిగారు. స్వాధీనం చేసుకున్న నగదు ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దాదాపు 5 గంటల పాటు సాగిన ఈ సోదాల్లో ఆదాయపు పన్ను శాఖ బృందం షోరూమ్‌లోని ప్రతి మూలను సోదా చేసింది. దీంతో పాటు చెప్పుల వ్యాపారికి చెందిన పలు ప్రాంతాల్లో ఐటీ బృందం తనిఖీలు చేసింది. ఇంత భారీ పన్ను ఎగవేత అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఆగ్రాలో చెప్పుల వ్యాపారులపై జరిగిన ఈ దాడి నగరంలో కలకలం సృష్టించింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఐటీ శాఖ ఆగ్రా సహా పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహిస్తోంది.



# కూలిన ఇరాన్ అధ్యక్షుడి హెలికాప్టర్

## కొనసాగుతున్న గాలింపు చర్యలు

**టెహ్రాన్:** ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ఆదివారం ప్రమాదానికి గురైంది. వాతావరణం అనుకూలించకోవడంతో కూలిపోయనట్లు ఇరాన్ ప్రభుత్వం మీడియా ప్రకటించింది. హెలికాప్టర్‌కు ఏమి జరిగింది..అందులో ఎవరు ఉన్నారు అనే దానిపై ఇంకా స్పష్టత లేదు. హెలికాప్టర్‌లో ఇరాన్ ఆర్థిక మంత్రి అమీర్ అబ్దుల్లాహియాన్ కూడా అధ్యక్షుడితో ఉన్నట్లు తెలుస్తోంది. కూలిన హెలికాప్టర్ కోసం గాలింపు చర్యలు జరుగుతున్నందున మరిన్ని వివరాలు త్వరలో తెలుస్తాయని ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ తెలిపింది. మీడియా ప్రకారం.. ఇరాన్‌లోని తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్స్‌లోని జోల్ఫా సమీపంలో ఆదివారం ఈ సంఘటన జరిగింది. రైసీ పొరుగున ఉన్న అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలియేవ్‌తో కలిసి డ్యామ్‌ను ప్రారంభోత్సవం పాల్గొన్నారు. రైసీ కాన్వాయ్ లో మూడు హెలికాప్టర్లు ఉన్నాయని, అందులో రెండు హెలికాప్టర్లు సురక్షితంగా తిరిగి వచ్చాయని మీడియా తెలిపింది. ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ, విదేశాంగ మంత్రి హొస్సేన్ అమీరబ్దొల్లాహియాన్, అయతోల్లా మొహమ్మద్ అలీ అలె హాషేమ్ లు ప్రమాదానికి గురైన హెలికాప్టర్ లో ఉన్నట్లు తెలుస్తోంది.

# కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి



**కోనరావుపేట, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లి, గ్రామంలో సీపీఎం జిల్లా కమిటీ నాయకురాలు జవ్వాజి విమల ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య, బడుగు బలహీన వర్గాల కోసం అంటరానితనం విముక్తి కోసం ఎంతో కృషి చేశారని 17 సార్లు ఎమ్మెల్యే,గా అలాగే ఎంపీగా తన సేవలను ప్రజల కోసం అంకితం చేశాడని పిల్లలొద్దని ప్రజలే నా పిల్లలని తనకున్న ఆస్తులను పేదలకు పంపిణీ చేశారని అన్నారు. సైకిల్ మీద అసెంబ్లీకి వెళ్లి పేదల సమస్యలను అసెంబ్లీలో గలం విప్పిన గొప్ప మహనీయుడు ఇలాంటి మహానీయుని గురించి ఎంత చెప్పుకున్న తక్కువెననిఅతని స్మరించుకొని అలాంటి గొప్ప నాయకుని వర్ధంతి వేడుకలను జరుపుకోవడం ఎంతో అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బుచ్చయ్య, నరసవ్వ, పోశవ్వ, సులోచన,పావని, గాయత్రి, భవాని, నరసవ్వ, తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో భారీ చోరీ

**9తులాల బంగారం, 15తులాల వెండి మాయం**

**కామారెడ్డి, ప్రజానావ:** కామారెడ్డిలో భారీ చోరీ జరిగింది. జిల్లా కేంద్రంలోని రాజానగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లోకి దొంగలు చొరబడి.. ఇళ్లు గుల్ల చేశారు. కాలనీకు చెందిన శ్రీకాంత్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లి వచ్చే సరికి కొందరు గుర్తుతెలి యని దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న 9తులాల బంగారం, 2వేల నగదు, 15తులాల వెండిని దోచుకెళ్లారు దుండగులు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు కామారెడ్డి పట్టణ పోలీసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# పిడుగుపాటుకు ఇద్దరు మృతి

## వికారాబాద్ లో విషాదం


**వికారాబాద్, ప్రజానావ:** పిడుగపాటుకు ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ విషాద సంఘటన వికారాబాద్ జిల్లా యాలాల మండలం జుంటుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఆదివారం గ్రామంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగు పడి గ్రామానికి చెందిన మంగలి శ్రీనివాస్, కొన్నిటి లక్ష్మప్ప అనే ఇద్దరు వ్యక్తులు పొలంలోనే ప్రాణాలు కోల్పోయారు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది.

# ఎవరికీ బ్యాంకు వివరాలు, ఓటీపీ చెప్పొద్దు

## సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్



**సిరిసిల్ల, ప్రజానావ:** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మీ ప్రమేయం లేకుండా వచ్చిన ఓటీపీ నెంబర్, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పవద్దని సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా ప్రజలకు సూచించారు. ఆన్‌లైన్‌లో కస్టమర్ కేర్ నెంబర్లు సెర్చ్ చేయవద్దని, ప్రజలు ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే ట్రోల్ ఫ్రీ నెంబర్ 1930 కి కాల్ చేయాలన్నారు. ఈ సందర్భంగా వారం రోజుల వ్యవధిలో జిల్లావ్యాప్తంగా జరిగిన కొన్ని సైబర్ నేరాలను వివరించారు. సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో టైలరింగ్ చేస్తూ ఉన్న ఒక బాధితునికి ఆర్మీ నుంచి ఆఫీసర్స్ మాట్లాడుతున్నామని చెప్పి డ్రెస్సెస్ స్టిచ్చింగ్ చేయాలని, అమౌంట్ సెండ్ చేస్తాము అని చెప్పి గూగుల్ పే, ఫోన్ పే ద్వారా వాళ్లు అమౌంట్ పంపుతున్నట్టుగా నమ్మించారన్నారు. పిన్ ఎంటర్ చేస్తే మీకు అమౌంట్ వస్తాయని చెప్పగా బాధితుడు పిన్ ఎంటర్ చేయగా రూ.25వేలు నష్టపోయారని వివరించారు. అలాగే వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో క్విక్ యాప్ అని లోన్ యాప్ ద్వారా రూ.3వేల లోన్ తీసుకొని దానిని చెల్లించినా ఇంకా డబ్బులు పంపించాలని, లేదంటే తన మార్ఫ్‌డ్ ఫొటోస్ ని సోషల్ మీడియాలో వాళ్ల కాంటాక్ట్స్ కి పంపిస్తామని బెదిరింపులకు పాల్పడగా బాధితులు రూ.15వేలు పంపించడం జరిగిందన్నారు. ఇంకా అమౌంట్ పంపించమని అడగ్గా, అనుమానం వచ్చి బాధితులు సైబర్ క్రైమ్ కి రిపోర్ట్ చేశారని చెప్పారు. గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితుడికి తెలియకుండా ఏదో ఒక ఫ్రాడ్ లింక్ క్లిక్ చేయడం వలన అతని ఫోన్‌లో ఒక ఏపీకే ఇన్స్టాల్ కావడం జరిగింది. తర్వాత తన ఫోన్ హ్యాక్ అయి తనకు తెలియకుండానే రూ.50వేలు నష్టపోయారని పేర్కొన్నారు. లోన్ యాప్ లకు దూరంగా ఉండాలని, కస్టమర్ కేర్ నంబర్లను గూగుల్ లో అస్సలు వెతకవద్దన్నారు. ఆయా సంస్థల అధికారిక వెబ్ సైట్ నుంచి మాత్రమే కస్టమర్ కేర్ నంబర్లను పొందాలని ఎస్పీ సూచించారు. లాటరీ తగిలిందంటూ ఎవరైనా మెసేజ్ చేసినా, మెయిల్ పంపించినా స్పందించవద్దని, సైబర్ నేరాలకు గురి అయితే వెంటనే 1930 నంబర్ కు ఫోన్ చేయాలన్నారు. ఆన్‌లైన్ వెబ్ సైట్లో రిపోర్ట్ చేయాలని సూచించారు.



# మళ్లీ కరోనా కలకలం

- సింగపూర్‌లో 30వేలకు చేరుకున్న కేసులు
- వారం వ్యవధిలోనే 90శాతం పెరుగుదల

**కౌలాలాంపూర్:** కరోనా వైరస్ మళ్లీ కలకలం సృష్టిస్తోంది. నాలుగేళ్ల క్రితం ప్రపంచాన్ని వణికించిన ఈ మహమ్మారి కోట్లాది మందిని పొట్టనపెట్టుకుంది. కొత్త కొత్త వేరియంట్లతో పురుడు పోసుకుంటున్న ఈ వైరస్ అలజడి మళ్లీ మొదలైంది. తాజాగా సింగపూర్‌లో కొవిడ్ భారీన పడిన వారి సంఖ్యల దాదాపు 30వేలకు చేరింది. గత వారం 13వేల లోపు ఉన్న కేసులు ఒక్క వారంలోనే ఈ స్థాయికి పెరగడంతో అక్కడి ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మరోవైపు రానున్న రెండు, మూడు నెలల్లో ఈ వైరస్ మరింత పెరిగే అవకాశం ఉందని సింగపూర్ ఆరోగ్య శాఖ మంత్రి ఓంగ్ యే కుంగ్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, ఇప్పటివరకైతే ఎలాంటి ఆంక్షలను ప్రభుత్వం పెట్టలేదన్నారు.

# కూతురు హత్య కేసులో తల్లిదండ్రుల అరెస్టు



**సిరిసిల్ల, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన చెప్యాల ఎల్లవ్వ, నరసయ్యల కూతురు ప్రియాంక ఈ నెల 14న మృతి చెందింది. మృతిపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేయగా, పంచాయతీ సెక్రటరీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసును విచారించిన పోలీసులు తల్లిదండ్రులే ప్రియాంకను హత్య చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా పోలీస్ కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. ప్రియాంక గత ఏడేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. తల్లిదండ్రులు ఆమెను ఆస్పత్రులు, దేవాలయాల చుట్టూ తిప్పగా కొంతవరకు నయమైంది. దీంతో 2020లో ప్రియాంకకు నంగునూరు మండలం దర్గపల్లి చెందిన పృథ్వీ అనే వ్యక్తితో వివాహం జరిపించారు. వీరు బతుకు తెరువు కోసం వారు కరీంనగర్ లోని సప్తగిరి కాలనీలో నివాసముంటున్నారు. వీరికి 13 నెలల కుమారుడు ఉన్నాడు. అయితే నెల రోజులుగా ప్రియాంక మునుపటిలాగే మానసిక వ్యాధితో అందరిని ఇబ్బంది పెట్టడం, చుట్టుపక్కల వారిని దూషించటం, గొడవ పెట్టుకోవడంతో భర్త విషయాన్ని ప్రియాంక తల్లిదండ్రులకు వివరించాడు. వారు వచ్చి ప్రియాంక తీసుకెళ్లారు. మళ్లీ దేవాలయాలు, ఆస్పత్రుల చుట్టూ తిప్పినా నయం కాలేదు. దీంతో విసిగిపోయిన తల్లిదండ్రులు మంగళవారం అర్ధరాత్రి ప్రియాంక నిద్రిస్తుండగా నూలు దారంతో ఉరి వేసి హత్య చేసినట్లు విచారలో అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్టు ఎస్పీ తెలిపారు. ప్రజల విజ్ఞప్తి మేరకు హత్య కేసును ఛేదించడం జరిగిందని, గ్రామాలు.. పట్టణాల్లో ఎవరైనా అనుమానస్పదంగా కనిపస్తే వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో రూరల్ ఇన్‌చార్జి సీఐ, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సుధాకర్ పాల్గొన్నారు.



# అపూర్వ సమ్మేళనం

**చందుర్తి, ప్రజానావ:** వారంతా చిన్ననాటి స్నేహితులు.. ఒకే చోట చదువుకున్నారు. పదవ తరగతి పూర్తయ్యాక కొంతమంది ఉద్యోగాల్లో స్థిరపడగా, మరి కొంతమంది వ్యాపారం, ఇతర రంగాల్లో కొనసాగుతున్నారు. చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల విద్యార్థులు ఆదివారం పాఠశాలల నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాతో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులందరూ ఒకే చోట చేరడంతో సందడి నెలకొంది. ఈ మధుర జ్ఞాపకాలను తమ తమ సెల్ ఫోన్లలో బంధించుకున్నారు. వారు చదువుకున్న పాఠశాలకు తమ వంతు సహాయంగా స్త్రీ ల మూత్రశాలలకు మెరుగైన వసతులను కల్పించడం కోసం సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, బాబు, అశోక్, గంగాధర్, పీ. పద్మ, వై. పద్మ, ఎం. పద్మ, శైలజ తదితరులు పాల్గొన్నారు.



# నేనున్నా.. బాధపడొద్దు

- గణేశ్ భూమల్ల మృతిపై దుబాయ్‌లో విప్ ఆది శ్రీనివాస్ ఆరా
- స్వయంగా కంపెనీ క్యాంపునకు వెళ్లిన వేములవాడ ఎమ్మెల్యే
- మృతదేహాన్ని త్వరగా భారత్‌కు పంపేలా చూడాలని వినతి
- గణేశ్ కుటుంబసభ్యులకు వీడియో కాల్ ద్వారా భరోసా

**వేములవాడ, ప్రజానావ:** గత శాసనసభ ఎన్నికల్లో వేములవాడ నియోజకవర్గ గల్ఫ్ కార్మికుల కుటుంబాలు తన విజయంలో కీలకపాత్ర పోషించాయని, గల్ఫ్ బిడ్డలకు కృతజ్ఞత తెలపాలని దుబాయ్‌కు వెళ్లిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అక్కడి గల్ఫ్ కార్మికులను కలవడంతో పాటు వారి సమస్యలపై ఆరా తీశారు. ఇందులో భాగంగా దుబాయ్‌లోని అల్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన భీమారం మండలం మోత్కురావుపేట్ గ్రామానికి చెందిన గణేశ్ భూమల్ల (25) మృతికి గల కారణాలను స్వయంగా వెళ్లి తెలుసుకున్నారు. దుబాయ్ నుంచి దాదాపు 200 కిలోమీటర్లు ప్రయాణించి అక్కడికి చేరుకున్న ఆది శ్రీనివాస్ గల్ఫ్ వెల్ఫేర్ అవేర్నెస్ కమిటీ (జీడబ్ల్యూఏసీ) యూఏఈ ఉపాధ్యక్షుడు మల్లేశ్ కోరేపుతో కలిసి గణేశ్ కంపెనీకి వెళ్లారు. అక్కడ క్యాంప్ బాస్ విజయ్‌ను కలుసుకొని గణేశ్ మృతికి గల కారణాలపై ఆరా తీశారు. అక్కడే ఉన్న గణేశ్ గదికి వెళ్లి ఆయన బెడ్‌ను చూసి కొద్దిసేపు భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం కంపెనీ హెచ్‌ఆర్ కలిసి (జీడబ్ల్యూఏసీ) యూఏఈ ఉపాధ్యక్షుడు మల్లేశ్‌తో పాటు కంపెనీ బాస్ విజయన్‌తో కలిసి అక్కడి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి రిపోర్ట్ త్వరగా ఇప్పించాలని కోరారు. కంపెనీ హెచ్‌ఆర్‌తో మాట్లాడి గణేశ్ మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి పంపే ఏర్పాటు చేయాలలన్నారు. అంతకుముందు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మృతుడు గణేశ్ రూమ్‌కు వెళ్లి వారి కుటుంబసభ్యులకు వీడియో కాల్ చేసి ధైర్యం చెప్పారు. 'నేనున్నాను' అంటూ భరోసా కల్పించారు. ఆది శ్రీనివాస్ వెంట జీడబ్ల్యూఏసీ యూఏఈ అధ్యక్షుడు రవి కటుకం, రుద్రంగి మండల అధ్యక్షుడు బొల్లి కుమార్, మోతె బాబు, నరేశ్, గగన్ ఆకుల, రాజు తదితరులున్నారు.



# తెలంగాణలో బలహీనపడిన ఆవర్తనం

## మూడు రోజులు పాటు వర్షాలు

**ఖైరతాబాద్, ప్రజానావ:** తెలంగాణలో రాగల మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశ ముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదివారం కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలుల తో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురు స్తాయని వెల్లడించింది. నైరుతి రుతుపవనాలు ఆదివారం మాల్దీవులలో కొంత వరకు, కోమరిన్ ప్రాంతంలో కొంతమేర, దక్షిణ బంగాళాఖాతం, నికోబార్ దీవులు, దక్షిణ అండమాన్ సముద్రంలోని కొన్ని ప్రాంతాల వరకు విస్తరించాయని వాతావరణ కేంద్రం సంచాలకులు వివరిం చారు. దక్షిణ ఛత్తీస్గఢ్ నుంచి తెలంగాణ, రాయలసీమ మీదుగా దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు సగటు సముద్ర మట్టానికి 3.1 కి.మీ ఎత్తులో కొనసాగిన ఆవర్తనం ఈరోజు బలహీన పడిందని పేర్కొన్నారు.



# కారు ఢీ ఒకరికి గాయాలు

**చందుర్తి, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల చందుర్తి మండలం లింగంపేట గ్రామ బస్టాండ్ ప్రాంతంలో రుద్రంగి నుంచి వేములవాడ వైపు వెళ్తున్న గుర్తుతెలియని కారు ఢీకొని బోదాసు వెంకటి (55) అనే వ్యక్తం తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

**చందుర్తి, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం ఎనగల్ గ్రామంలో ఈక శేషవ్వ (46) అనే మహిళ ఆదివారం ఉదయం తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఒక కొడుకు, కుమార్తె ఉన్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.


# బాన్సువాడలో కలకలం

## నిర్మాణంలో ఉన్న భవనంలో మహిళ, బాలుడి మృతదేహాలు

**బాన్సువాడ, ప్రజానావ:** కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని న్యూ వీక్లీ మార్కెట్ సమీపంలో కొత్తగా నిర్మాణం అవుతోన్న భవంతిలో ఓ మహిళ, ఓ బాలుడి మృతదేహాలు లభించాయి. ఈ సంఘటన బాన్సువాడ లో కలకలం రేపింది. కొత్త భవనంలో 30 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన మహిళా మృతదేహం, 6 నుంచి 8 సంవత్సరాలు కలిగిన బాలుడు మృతదేహాలను ఆదివారం ఉదయం 11 గంటలకు పోలీసులు గుర్తించారు. మృతదేహాలు కుళ్ళిపోయి ఉన్నాయని బాన్సువాడ పట్టణ సీఐ మున్నూరు కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ గుర్తుతెలియని కుళ్లిపోయిన రెండు మృతదేహాలను న్యూ వీక్లీ మార్కెట్ దగ్గరలోని కొత్తగా నిర్మాణం అవుతున్న భవనంలోని ఒక షెటర్లో ఒక మహిళ, ఒక బాలుడు చనిపోయి ఉండడాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వచ్చి చూడగా మహిళ, బాలుడు మృతి చెంది మూడు నుంచి నాలుగు రోజులు అయినట్లు తెలిపారు. మృతి చెందిన వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, ఒంటిపై లేత గోధుమ రంగు టాప్, నలుపు రంగు పాయింటు దుస్తులు ధరించి, ఎత్తు ఐదు ఫీట్ల పొడవు కలిగి ఉన్నారని, బాలుడు ఆకుపచ్చ టీ షర్ట్, కాషాయం రంగు కలిగిన నిక్కర్ ఉందని తెలిపారు. మృతదేహాలను బాన్సువాడ పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించామన్నారు. ఎవరైనా మృతదేహాల వివరాలు తెలిసినవారు బాన్సువాడ పట్టణ సీఐ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కాగా ఈ సంఘటన లో మహిళ, బాలుడు తల్లి, కొడుకా? ఆత్మహత్య చేసుకున్నారా? లేదా హత్య చేసి కొత్త భవనం లో పడేశారా? అనే అనుమానాలు పోలీసుల విచారణలో తేలనున్నాయి.

## చెర్రీ ఆ మజాకా.! గురుశిష్యులకు

# రామ్ చరణ్ సమన్యాయం.!



ఓ వైపు గేమ్ ఛేంజర్ షూటింగ్ అయిపోనే లేదు.. అంతలోనే బుచ్చిబాబు ఓపెనింగ్ జరిగింది.. తర్వాత సుకుమార్ ను ప్రకటించారు రామ్ చరణ్. అసలీయన ప్లానింగ్ ఏంటి..? ఇంత బిజీలో ఇన్ని లను ఎప్పుడు పూర్తి చేస్తారు..? గురుశిష్యుల ల కోసం మెగా వారసుడు చేస్తున్న ప్లాన్ ఎలా ఉండబోతుంది..? గేమ్ ఛేంజర్ షూటింగ్ చివరిదశకు వచ్చింది. మరో వారం రోజుల్లోనే దీన్నుంచి బయటికి రాబోతున్నారు రామ్ చరణ్. ఓ వైపు గేమ్ ఛేంజర్ షూటింగ్ అయిపోనే లేదు.. అంతలోనే బుచ్చిబాబు ఓపెనింగ్ జరిగింది.. తర్వాత సుకుమార్ ను ప్రకటించారు రామ్ చరణ్. అసలీయన ప్లానింగ్ ఏంటి..? ఇంత బిజీలో ఇన్ని లను ఎప్పుడు పూర్తి చేస్తారు..? గురుశిష్యుల ల కోసం మెగా వారసుడు చేస్తున్న ప్లాన్ ఎలా ఉండబోతుంది..? గేమ్ ఛేంజర్ షూటింగ్ చివరిదశకు వచ్చింది. మరో వారం రోజుల్లోనే దీన్నుంచి బయటికి రాబోతున్నారు రామ్ చరణ్. అందుకే ఇకపై కాన్సన్ట్రేషన్ అంతా గురు శిష్యులపై పెట్టబోతున్నారు. అంటే బుచ్చిబాబు, సుకుమార్ ప్రాజెక్ట్స్ అన్నమాట. డిసెంబర్‌లో గేమ్ ఛేంజర్ విడుదలయ్యేలా ఉ ంది. ఇక జూన్ నుంచి బుచ్చిబాబు సెట్స్‌పైకి రానుంది. పైగా ఈ రెండింటినీ నిర్మిస్తుంది మైత్రి మూవీ మేకర్సే. కానీ అది చెప్పినంత ఈజీ అయితే కాదు. ఎందుకంటే గేమ్ ఛేంజర్ షూటింగ్ పూర్తైనా.. దాని ప్రమోషన్ కోసం టైమ్ కేటాయించాలి. మరోవైపు ఎంత వేగంగా పూర్తి చేసినా.. బుచ్చిబాబు ప్రాజెక్ట్ కనీసం ఏడాదైనా పడుతుంది. ఆ తర్వాతే సుకుమార్ సెట్స్‌పైకి వచ్చేది. పుష్ప 2 నుంచి సుకుమార్ ఫ్రీ అయ్యేలోపు.. బుచ్చిబాబు పూర్తి చేయాలనేది చరణ్ ప్లాన్. ఆల్రెడీ ప్రీ ప్రొడక్షన్ అయిపోయింది కాబట్టి.. ఆర్నెళ్లలోనే షూట్ పూర్తి చేయాలని చూస్తున్నారు బుచ్చి. అలా పూర్తైతే డిసెంబర్ నుంచి 17 సెట్స్‌పైకి రానుంది. మొత్తానికి 2025 పూర్తయ్యేలోపు 3 లు చేయాలని చరణ్ ప్లాన్. కానీ అది వర్కవుట్ అయ్యేది మాత్రం దర్శకుల చేతిలోనే ఉంది.

## లేడీ పవర్ స్టార్‌కి స్టార్ హీరోలతో

# నటించడానికి ఆసక్తి లేదా.?



హీరోయిన్స్ అంతా ఎప్పుడెప్పుడు స్టార్ హీరోలతో జోడీ కడదామా..? ఎప్పుడెప్పుడు టాప్ ప్లేస్‌కు వెళ్లిపోదామా అని వేచి చూస్తుం టారు. ఒక్కసారి స్టార్స్‌తో నటించే అవకాశం కోసం కళ్లు కాయలు కాచేలా చూస్తుంటారు. కానీ సాయి పల్లవి మాత్రం డిఫెరెంట్. ఇన్నేళ్లుగా స్టార్ హీరోలకు దూరంగానే ఉన్నారీమె. ఇప్పటికీ పల్లవి చూపులు మీడియం రేంజ్ హీరోలపైనే ఉండటానికి కారణమేంటి..? ఒక్క చాలు.. హీరోయిన్స్ అంతా ఎప్పుడెప్పుడు స్టార్ హీరోలతో జోడీ కడదామా..? ఎప్పుడెప్పుడు టాప్ ప్లేస్‌కు వెళ్లిపోదామా అని వేచి చూస్తుంటారు. ఒక్కసారి స్టార్స్‌తో నటించే అవకాశం కోసం కళ్లు కాయలు కాచేలా చూస్తుంటారు. కానీ సాయి పల్లవి మాత్రం డిఫెరెంట్. ఇన్నేళ్లుగా స్టార్ హీరోలకు దూరంగానే ఉన్నారీమె. ఇప్పటికీ పల్లవి చూపులు మీడియం రేంజ్ హీరోలపైనే ఉండటానికి కారణమేంటి..? ఒక్క చాలు.. ఆడియన్స్ గుండెల్లో అలా ఉ ండిపోడానికి..! సాయి పల్లవికి ఫిదా అలాంటి నే. చేసింది తక్కువ లే అయినా.. లేడీ పవర్ స్టార్ అనే బిరుదు సొంతం చేసుకున్నారు ఈ బ్యూటీ. అనుకుంటే ఏ స్టార్ హీరోతో అయినా నటించొచ్చు గానీ ఎందుకో మరి సాయి పల్లవి మాత్రం ఎప్పుడూ మీడియం రేంజ్ హీరోలతోనే నటిస్తుంటారు. ఇప్పుడూ ఇదే చేస్తున్నారు. క్రేజ్ ఉంది కదా.. కోట్లు ఇస్తున్నారు కదా అని ఏ పడితే ఆ సైన్ చేయడం సాయి పల్లవి డిక్షనరిలోనే లేదు. కథ నచ్చాలి.. కండీషన్స్ ఒప్పుకోవాలి.. అప్పుడే ఓకే చేస్తారు. ఇప్పుడు కూడా నాగ చైతన్యతో తండేల్ మాత్రమే సాయి పల్లవి నటిస్తున్న. అలాగే తమిళంలో శివకార్తికేయన్‌తో అమరన్.. హిందీలో అమీర్ తనయుడితో ఓ .. రణ్‌బీర్‌తో రామాయణం లు చేస్తున్నారు. తెలుగులో సాయి పల్లవి మరో కు ఓకే చెప్పినట్లు తెలుస్తుంది. విజయ్ దేవరకొండ హీరోగా రవికిరణ్ కోలా తెరకెక్కించబోయే రూరల్ డ్రామాలో సాయి పల్లవిని తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. దిల్ రాజుతో గతంలో ఫిదా, ఎంసిఏ లు చేసారు పల్లవి. తాజాగా విజయ్ తో హ్యాట్రిక్ పూర్తి చేయాలని చూస్తున్నారు. మొత్తానికి ఈ కథకు సాయి పల్లవి ఓకే చెప్పారంటే మాత్రం.. సమ్‌థింగ్ స్పెషల్ ఉన్నట్లే.

# టిల్లు రూట్లో ఇస్మార్ట్.. సక్సెస్ అవుతారా.? అదే ఫార్ములనా



సీక్వెల్స్ ఎలా ఉండాలి.? ఆల్రెడీ చెప్పిన కథని కంటిన్యూ చేస్తే సరిపోతుందా.? లేకుంటే థీమ్ మాత్రం తీసుకుని కథలో కొత్తదనాన్ని క్రియేట్ చేసుకోవాలా? వీటన్నిటికీ మించి మరో విషయం ఉంది. అదే కమర్షియల్ సక్సెస్. ఏం చేసినా బొమ్మ బాక్సాఫీస్ దగ్గర దద్దరిల్లాలి. కాసుల వర్షం కురిపించాలి. లేటెస్ట్ బాక్సాఫీస్ సెన్సేషన్ టిల్లు స్క్వేర్ విషయంలో అదే జరిగింది. మరి టీజర్‌తోనే టిల్లు వైబ్స్ ని గుర్తు చేసిన డబుల్ ఇస్మార్ట్ పరిస్థితి ఏంటి.? సీక్వెల్స్ ఎలా ఉండాలి.? ఆల్రెడీ చెప్పిన కథని కంటిన్యూ చేస్తే సరిపోతుందా.? లేకుంటే థీమ్ మాత్రం తీసుకుని కథలో కొత్తదనాన్ని క్రియేట్ చేసుకోవాలా? వీటన్నిటికీ మించి మరో విషయం ఉంది. అదే కమర్షియల్ సక్సెస్. ఏం చేసినా బొమ్మ బాక్సాఫీస్ దగ్గర దద్దరిల్లాలి. కాసుల వర్షం కురిపించాలి. లేటెస్ట్ బాక్సాఫీస్ సెన్సేషన్ టిల్లు స్క్వేర్ విషయంలో అదే జరిగింది. మరి టీజర్‌తోనే టిల్లు వైబ్స్ ని గుర్తు చేసిన డబుల్ ఇస్మార్ట్ పరిస్థితి ఏంటి? డబుల్ ఇస్మార్ట్ టీజర్ ఎలా ఉంది అనే డిస్కషన్‌లో రిపీటెడ్‌గా వినిపిస్తున్న మాట ఒకటే. ఇస్మార్ట్ శంకర్ టెంప్లేట్‌లోనే ఉంది అనేది. రామ్ హీరోగా నటించిన ఇస్మార్ట్ శంకర్‌కి సీక్వెల్‌గా డబుల్ ఇస్మార్ట్ ని తెరకెక్కిస్తున్నారు పూరి జగన్నాథ్. డబుల్ ఇస్మార్ట్ టీజర్‌లో థీమ్, డైలాగులు, బ్యాక్‌డ్రాప్, ఈశ్వరుడి ప్రస్తావన... ఇలా ప్రతిదీ ఫస్ట్ పార్టుని గుర్తుచేస్తోంది. ఇటీవల విడుదలై బ్లాక్ బస్టర్ అయిన టిల్లు స్క్వేర్. సిద్ధు జొన్నలగడ్డ, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించారు. డీజే టిల్లు ఫ్లేవర్ సెకండ్ పార్టులోనూ కనిపించింది. డైలాగులు, కలర్స్, రాధిక కాన్సెప్ట్ , మ్యూజిక్.. ఇలా ప్రతిదీ ఫస్ట్ పార్టును గుర్తుచేసినా, బంపర్ హిట్ అయింది టిల్లు స్క్వేర్. ఫస్ట్ ఫ్రేమ్ నుంచి లాస్ట్ ఫ్రేమ్ దాకా నవ్విస్తూనే సాగింది టిల్లు స్క్వేర్. ఇంచ్ బై ఇంచ్ యూత్‌ని అట్రాక్ట్ చేయడంలో క్లిక్ అయింది కాబట్టే కాసుల వర్షం కురిసింది టిల్లు స్క్వేర్ కి. సీక్వెల్ ఇచ్చిన జోష్‌తో త్రీక్వెల్‌కి ప్రిపేర్ అవుతున్నారు మేకర్స్. టిల్లు విషయంలో కలిసొచ్చిన అంశం డబుల్ ఇస్మార్ట్ విషయంలోనూ రిపీట్ అవుతుందా? అనే డిస్కషన్ జరుగుతోంది. అదే జరిగితే చాన్నాళ్లుగా మంచి హిట్ కోసం వెయిట్ చేసిన రామ్ అండ్ పూరి ఫుల్ ఖుషీ కావడం ఖాయం.



# అలాంటి వ్యక్తి భర్తగా రావాలంటున్న చిట్టి..

ఒకే ఒక్క తో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది ఫరియా అబ్దుల్లా. అనుదీప్ కేవి తెరకెక్కించిన జాతిరత్నాలు తో తెలుగు తెరకు పరిచమయైన ఫరియా.. మొదటి తోనే తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యింది. ఇందులో తనదైన నటనతో అలరించింది ఫరియా. జాతిరత్నాలు తో చిట్టిగా గుర్తిండిపోయిన ఈ పొడుగు కాళ్ల సుందరి.. ఆ తర్వాత కొన్ని చిత్రాల్లో నటించింది. రావణసుర, బంగార్రాజు వంటి చిత్రాలతో మెప్పించిన ఫరియా. ఒకే ఒక్క తో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది ఫరియా అబ్దుల్లా. అనుదీప్ కేవి తెరకెక్కించిన జాతిరత్నాలు తో తెలుగు తెరకు పరిచమయైన ఫరియా.. మొదటి తోనే తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యింది. ఇందులో తనదైన నటనతో అలరించింది ఫరియా. జాతిరత్నాలు తో చిట్టిగా గుర్తిండిపోయిన ఈ పొడుగు కాళ్ల సుందరి.. ఆ తర్వాత కొన్ని చిత్రాల్లో నటించింది. రావణసుర, బంగార్రాజు వంటి చిత్రాలతో మెప్పించిన ఫరియా.. ఇటీవల ఆ ఒక్కటి అడక్కు తో మ-రోసారి ప్రేక్షకులను నవ్వించింది. ఈ మూవీ ప్రమోషన్లలో భాగంగా తన కాబోయ భర్త ఎలా ఉండాలో రివీల్ చేసింది ఫరియా. యాపిల్ బాక్స్ అవసరం లేని వాడే కావాలంటూ ఫన్నీగా ఆన్సర్ ఇచ్చింది. అలాగే తనకంటే హైట్ తక్కువ ఉన్న పర్లేదు సకానీ సెన్సాఫ్ హ్యూమర్ మాత్రం ఉ ండాలంటుంది ఫరియా. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉండే ఫరియా తాజాగా షేర్ చేసిన ఫోటోస్ వైరలవుతున్నాయి. స్కై బ్లూ కలర్ నెట్ డ్రెస్ లో ఎంతో అంద గా కనిపిస్తుంది. ఫరియాకు డాన్స్ అంటే చాలా ఇష్టం. ఆమె బెల్లీ డాన్స్ కు చాలా మంది అభిమానులు ఉన్నారు. ఫరియా అబ్దుల్లా హైదరాబాద్ లో పుట్టి పెరిగింది. 2021లో జాతిరత్నాలు తో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది ఫరియా. ఆ తర్వాత సంతోష్ శోభన్ నటించిన లైక్ షేర్ అండ్ సబ్ స్క్రైబ్ చిత్రంలో నటించింది. ఫరియా తమిళంలోనూ ఓ చేస్తుంది.

www.prajanaava.in || హైదరాబాద్ సోమవారం, మే 20, 2024 || ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..




# కొనసాగిన సన్‌రైజర్స్ జైత్రయాత్ర

- చివరి లీగ్ మ్యాచ్లో పంజాబ్‌పై విజయం
- అర్ధ సెంచరీతో రాణించిన అభిషేక్ శర్మ
- పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి హైదరాబాద్

**హైదరాబాద్ స్పోర్ట్స్, ప్రజానావ:** ఐపీఎల్ 2024 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ జైత్రయాత్రను కొనసాగిస్తోంది. పంజాబ్ కింగ్స్‌తో ఉప్పల్ వేదికగా జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో పాయింట్స్ టేబుల్‌లో రెండో స్థానానికి చేరింది. రాజస్థాన్ రాయల్స్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో ఓటమిపాలైతే సన్‌రైజర్స్ రెండో స్థానాన్ని కైవసం చేసుకోనుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 214 పరుగులు చేసింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్(45 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 71) హాఫ్ సెంచరీతో రాణించగా.. అథర్వ టైడ్(27 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 46), రిలీ రోసొ(24 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 49) తృటిలో అర్ధ శతకాలు చేజార్చుకున్నారు. చివర్లో జితేశ్ శర్మ(15 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 32 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో టీ నటరాజన్ రెండు వికెట్లు తీయగా.. ప్యాట్ కమిన్స్, విజయ్‌కాంత్ వియాస్కంత్ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేధనకు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 19.1 ఓవర్లలో 6 వికెట్లకు 215 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. అభిషేక్ శర్మ(28 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో 66),



హెన్రీచ్ క్లాసెన్(26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 42 ) సత్తాచాటారు. రాహుల్ త్రిపాఠి(18 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 33), నితీష్ కుమార్ రెడ్డి(25 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 37) కీలక ఇన్నింగ్స్ ఆడారు.

### ఆరంభంలోనే బిగ్ షాక్..

215 పరుగుల భారీ లక్ష్య ఛేధనకు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. అర్ష్‌దీప్ సింగ్ వేసిన తొలి బంతికే డేంజరస్ ట్రావిస్ హెడ్(0) గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. క్రీజులోకి వచ్చిన రాహుల్ త్రిపాఠితో కలిసి అభిషేక్ శర్మ చెలరేగాడు. రాహుల్ త్రిపాఠి సైతం భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. హాఫ్ సెంచరీ దిశగా సాగుతున్న అతన్ని హర్షల్ పటేల్ ఔట్ చేశాడు. దాంతో పవర్ ప్లేలో సన్‌రైజర్స్ 2 వికెట్లకు 84 పరుగులు చేసింది. క్రీజులోకి నితీష్ కుమార్ రెడ్డి రాగా.. అభిషేక్ శర్మ 21 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం మరింత దూకుడుగా ఆడిన అతన్ని శశాంక్ సింగ్ బోల్తా కొట్టించాడు. క్రీజులోకి వచ్చిన హెన్రీచ్ క్లాసెన్ సైతం తనదైన శైలిలో ధాటిగా ఆడగా.. నితీష్ కూడా బ్యాట్‌కు పని చెప్పాడు. అయితే హర్షల్ పటేల్ బౌలింగ్‌లో నితీష్ కుమార్ క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఆ వెంటనే షెహ్‌బాజ్ అహ్మద్(3) అర్ష్‌దీప్ సింగ్ ఔట్ చేయగా.. నిలకడగా ఆడుతున్న హెన్రీచ్ క్లాసెన్‌ను హర్‌ప్రీత్ బ్రార్ క్లీన్ బౌల్డ్ చేశాడు. చివరి ఓవర్‌లో సన్‌రైజర్స్ విజయానికి నాలుగు పరుగులు అవసరమవ్వగా.. సన్వీర్ సింగ్ బౌండరీ బాది విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

### చరిత్ర సృష్టించిన సన్‌రైజర్స్

సన్‌రైజర్స్ హైదరాబాద్ చరిత్ర సృష్టించింది. టీ20 క్రికెట్ చరిత్రలోనే సింగిల్ ఎడిషన్ టోర్నీలో 160 సిక్స్‌లు బాదిన జట్టుగా సన్‌రైజర్స్ హైదరాబాద్ నిలిచింది. ఈ క్రమంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) రికార్డును అధిగమించింది. 157 సిక్స్‌లతో ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్న ఆర్‌సీబీని సన్‌రైజర్స్ హైదరాబాద్ వెనక్కి నెట్టింది. ఐపీఎల్ 2024 సీజన్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో ఉప్పల్ వేదికగా ఆదివారం జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈ ఫీట్ సాధించింది. ఈ మ్యాచ్‌లో మొత్తం 14 సిక్స్‌లు బాదిన సన్‌రైజర్స్ ఓవరాల్‌గా 160 సిక్స్‌ల మార్క్‌ను అందుకుంది. అభిషేక్ శర్మ 6 సిక్స్‌లు బాదగా.. రాహుల్ త్రిపాఠి రెండు, నితీష్ కుమార్ రెడ్డి మూడు, హెన్రీచ్ క్లాసెన్ రెండు, అబ్దుల్ సమద్ ఓ సిక్సర్ కొట్టారు. ఈ జాబితాలో సన్‌రైజర్స్ హైదరాబాద్(160) తర్వాత ఆర్‌సీబీ(157), సీఎస్‌కే(145-ఐపీఎల్ 2018), సర్రే టీమ్(144- టీ20 బ్లాస్ట్ 2023), కేకేఆర్(143-కేకేఆర్(ఐపీఎల్ 2019) జట్లు వరుసగా కొనసాగుతున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఓ సీజన్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన బ్యాటర్‌గా అభిషేక్ శర్మ నిలిచాడు. తాజా సీజన్‌లో అతను 41 సిక్స్‌లు బాదాడు. హెన్రీచ్ క్లాసెన్ 33 సిక్స్‌లు కొట్టగా.. డేవిడ్ వార్నర్(ఐపీఎల్ 2016), ట్రావిస్ హెడ్ 31 సిక్స్‌లతో తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. ఓ ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సార్లు 200 ప్లస్ రన్స్ చేసిన జట్టుగానూ సన్‌రైజర్స్ గుర్తింపు పొందింది. 6 సార్లు 200 ప్లస్ రన్స్ చేసిన నిలిచింది.

# స్టార్ స్పోర్ట్స్‌పై హిట్‌మ్యాన్ ఆగ్రహం



### వ్యూస్ కోసం ఇలాంటి పనులు చేయొద్దని హెచ్చరిక

**ముంబై:** టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ.. బీసీసీఐ అధికారిక బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. తన మాటలను రికార్డ్ చేయవద్దని చెప్పినా స్టార్ స్పోర్ట్స్ వినలేదని, తన ప్రైవసీకి భంగం కలిగేలా ప్రసారం చేసిందని మండిపడ్డాడు. స్నేహితులు, సహచర ఆటగాళ్లతో సరదాగా జరిపే సంభాషణలను రికార్డ్ చేయడం ద్వారా ఆటగాళ్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్లేయర్లకు ప్రైవసీ లేకుండా పోయిందని రోహిత్ శర్మ ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశాడు. వ్యూస్ కోసం ఇలాంటి పనులు చేస్తే ఏదో ఒక రోజు అభిమానులు, క్రికెటర్లు, క్రికెట్ మధ్య ఉన్న విశ్వాసం దెబ్బ తింటుందని హెచ్చరించాడు.

నమ్మకం పోతుంది..

'క్రికెటర్లకు ప్రైవసీ లేకుండా పోయింది. ట్రైనింగ్ లేదా మ్యాచ్ జరిగే రోజుల్లో సహచర ఆటగాళ్లు, స్నేహితులతో సరదాగా మాట్లాడుతున్న మాటలను రికార్డ్ చేస్తున్నారు. ఇది ఆటగాళ్ల గోప్యత, స్వేచ్ఛను హరిస్తోంది. నా మాటలను రికార్డ్ చేయవద్దని స్టార్ స్పోర్ట్స్‌ను కోరినప్పటికీ.. నా ప్రైవసీకి భంగం కలిగించే విధంగా ఆ వీడియోను ప్రసారం చేశారు. ప్రత్యేకమైన కంటెంట్, వ్యూస్‌ల కోసం ఇలాంటి పనులు చేస్తే ఏదో రోజు ఆటగాళ్లు, అభిమానులు, క్రికెట్ మధ్య ఉన్న విశ్వాసాన్ని దెబ్బ తీస్తోంది.'అని రోహిత్ శర్మ ఆవేదన వ్యక్తం చేశాడు.

ఆడియో మ్యూట్‌లో పెట్టు..

లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్ ప్రారంభానికి ముందు రోహిత్ శర్మ.. తమ మాటలను రికార్డ్ చేయవద్దని బ్రాడ్‌కాస్టర్ కెమెరామెన్‌కు సూచించాడు. తన ముంబై రంజీ టీమ్ మేట్స్‌తో రోహిత్ శర్మ సరదా మాట్లాడుతుండగా.. బ్రాడ్‌కాస్టర్ కెమెరాలు రోహిత్‌ను చూపించే ప్రయత్నం చేసాయి. దాంతో ఆగ్రహానికి గురైన రోహిత్ శర్మ ఆడియో మ్యూట్‌లో పెట్టాలని కెమెరామెన్‌కు సూచించాడు. ఇప్పటికే ఓ ఆడియోతో తాను ఇబ్బందుల్లో పడ్డానని తెలిపాడు. తాను చెప్పినా వినకుండా ఈ వీడియోను ప్రసారం చేయడంతో రోహిత్ శర్మ ఆగ్రహానికి గురయ్యాడు. దాంతోనే సోషల్ మీడియా వేదికగా స్టార్ స్పోర్ట్స్‌పై అసంతృప్తిని వ్యక్తం చేశాడు.

ఇదే చివరి సీజన్ అంటూ..

ఈ సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో మ్యాచ్ సందర్భంగా ఆ జట్టు అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్‌తో రోహిత్ శర్మ మాట్లాడిన మాటలు ప్రకంపనలు సృష్టించాయి. ముంబై ఇండియన్స్ టీమ్ పేరును ప్రస్తావించకుండా ఆ జట్టును ఉద్దేశించి రోహిత్ శర్మ సంచలన వ్యాఖ్యలు చేశాడు. 'అన్నీ ఒక్కొక్కటిగా మారిపోతున్నాయి. ఇదంతా వాళ్లపై ఆధారపడి ఉంది. నేను ఏమీ పట్టించుకోవట్లేదు. ఏదేమైనా, అది నా ఇల్లు, నేను నిర్మించుకున్న దేవాలయం. మొత్తానికి ఇదే నా చివరిది" అని హిట్ మ్యాన్ పేర్కొన్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. TELTEL02116